తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice
వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

05-05-2026
మంగళవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 93

PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

## కామాంధుడికి 20 ఏళ్ల జైలు!



- చారిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు
- రూ. 8 వేల జరిమానా సైతం
- పోలీసుల దర్యాప్తును అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, (సిరి న్యూస్)**
సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడికి సంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. సోమవారం వెలువడిన ఈ తీర్పులో నిందితుడు శాంసన్ అలియాస్ మేథారి శాంసన్ (20)ను దోషిగా తేలుస్తూ న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన నిందితుడు శాంసన్, 2023లో సదాశివ పేట పరిధిలో ఒక మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడటంతో ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు.

- వడదెబ్బకు ప్రాణాలు పోతున్నా సర్కారుకు పట్టదా?
- మొక్కజొన్న కేంద్రాలను తగ్గించి దళారులకు కొమ్ముకాస్తున్నారు
- సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం
- అందుకే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది
- వారం రోజుల్లో ధాన్యం సేకరించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



## రైతుల ఉసురు పోసుకుంటున్రు..

**సదాశివపేట, మే 4 (సిరిన్యూస్):**
రాష్ట్రంలో రైతులు చచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వం వదిలిపెట్టడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ధ్వజమెత్తారు. సోమవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు

మిగతా 2వ పేజీలో..

### కేరళలో యూడీఎఫ్ విజయంపై
## రేవంత్ రెడ్డి అభినందనలు

- అసాధారణ విజయం సాధించిన కాంగ్రెస్ కూటమి
- జాతీయ నేతలకు ప్రత్యేక అభినందనలు
- ప్రజాస్వామ్య విలువలకు ప్రజల మద్దతు స్పష్టం





## ఐక్యత, అభివృద్ధికి పెద్ద పీట

- కేరళంలో యూడీఎఫ్ విజయంపై మంత్రి దుద్దిళ్ల



## వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు



## రాష్ట్ర ప్రజలు కూడా బీజేపీ వైపే

# మూడు చోట్ల కమలం!

మూడు రాష్ట్రాల్లో ఎగిరిన కాషాయ జెండా
బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో బీజేపీ హవా
కేరళలో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ దళం
తమిళనాట దళపతి పార్టీ సంచలన విజయం
బెంగాల్ లో కుప్పకూలిన అధికార పార్టీ
కొలత్తూరులో ముఖ్యమంత్రి స్టాలిన్ ఓటమి
అసోంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి
పుదుచ్చేరి పీఠం మరోసారి పాత ప్రభుత్వానికే
వామపక్షాలకు కేరళ ఓటర్ల తీవ్ర నిరాశ






పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కమలం వికసించి అధికార పీఠాలు దక్కించుకుంది. ఇక పదేళ్ల తర్వాత కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి జయకేతనం ఎగురవేసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ద్రావిడ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న తమిళనాడులో మాత్రం అనూహ్యంగా కొత్త పార్టీ టీవీకే ఏకపక్ష విజయం సాధించి అందరినీ విస్మయానికి గురిచేసింది.



## నిరంతర కృషితోనే బీసీల సామాజిక ఆర్థికాభివృద్ధి

- కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాంశ్

### గత ప్రభుత్వ విద్యుత్ అక్రమాల
## విచారణ సీబీఐకి అప్పగింత

- భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై చర్యలు
- రాష్ట్రంలో భూముల ధరల సవరణ, క్రమబద్ధీకరణ
- హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం
- నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం





## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రైతు వారోత్సవాలు ప్రారంభించిన మంత్రి తుమ్మల

**తాండూరు, (సిరి న్యూస్), మే 4:**
రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రైతు వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

మిగతా 3వ పేజీలో..



## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

- టీబీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

### రెండు కార్పొరేషన్లు, ఐదు పురాల్లో
## స్పెషలాఫీసర్ పాలన

- ఈ నెల 6న ముగియనున్న పాలక వర్గాల గడువు





## పీఏసీఎస్ ఎన్నికలపై ప్రభుత్వానికి హైకోర్టు షాక్

తాజా సహకార సంఘాల పాలక వర్గాలకు అవకాశం

**తెలంగాణ బ్యూరో (సిరి న్యూస్):**
రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు

మిగతా 3వ పేజీలో..

### మోదీ అభివృద్ధి అజెండాకు
## ప్రజల మద్దతు

- బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్
- మూడు రాష్ట్రాల్లో విజయంతో బీజేపీ సంబరాలు



# మూడు చోట్ల కమలం!



దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో జాతీయ పార్టీలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాయి. మొత్తం ఐదు రాష్ట్రాలకు గానూ ఏకంగా మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ కూటమి ఘన విజయం సాధించి సత్తా చాటింది. పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కమలం వికసించి అధికార పీఠాలు దక్కించుకుంది. ఇక పదేళ్ల తర్వాత కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి జయకేతనం ఎగురవేసి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ద్రావిడ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న తమిళనాడులో మాత్రం అనూహ్యంగా కొత్త పార్టీ టీవీకే ఏకపక్ష విజయం సాధించి అందరినీ విస్మయానికి గురిచేసింది.

**బెంగాల్ లో కమల వికాసం..**

పశ్చిమ బెంగాల్ శాసనసభలో మొత్తం 294 స్థానాలున్నాయి. ఇక్కడ అధికారంలోకి రావడానికి 148 స్థానాల మ్యాజిక్ ఫిగర్ అవసరం. దశాబ్దానికి పైగా అధికారంలో ఉన్న టీఎంసీకి ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. భారీ ఆధిక్యంతో బీజేపీ మ్యాజిక్ ఫిగర్ ను సునాయాసంగా దాటేసి అధికార పీఠాన్ని కైవసం చేసుకునే దిశగా దూసుకుపోతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని అధికార పార్టీ ఏమాత్రం ప్రభావం చూపలేక చతికిలపడింది. తాజా ట్రెండ్స్ ప్రకారం బీజేపీ 160 కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతుండగా.. ప్రధాన ప్రతిపక్షానికే పరిమితం కాబోతున్న టీఎంసీ 100 లోపు స్థానాలతో సరిపెట్టుకునేలా కనిపిస్తోంది. వామపక్షాలు, కాంగ్రెస్ కూటమి సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యే ప్రమాదం నెలకొంది.

**తమిళనాట టీవీకే సంచలనం..**

తమిళనాడు శాసనసభలో మొత్తం 234 స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 118 స్థానాలు సాధించాలి. ద్రావిడ రాజకీయాలకు కేంద్ర బిందువైన ఇక్కడ పూర్తిగా ఊహించని ఫలితాలు వస్తున్నాయి. దళపతి విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఘన విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించబోతోంది. ఇప్పటికే మ్యాజిక్ ఫిగర్ ను దాటేసిన ఆ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. అధికార డీఎంకే తీవ్ర పరాభవాన్ని మూటగట్టుకుంది. ఏకంగా ముఖ్యమంత్రి స్టాలిన్ కొలత్తూరు నియోజకవర్గంలో వెనుకంజలో ఉండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రతిపక్ష హోదా కోసం ఏఐఏడీఎంకే, డీఎంకే మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ రెండు పార్టీలు చెరో 50 స్థానాల దరిదాపుల్లోనే ఆగిపోయే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

**కేరళలో కాంగ్రెస్ దళం..**

కేరళ శాసనసభలో మొత్తం 140 స్థానాలున్నాయి. ఇక్కడ అధికార పీఠం దక్కించుకోవాలంటే 71 స్థానాల్లో గెలవాలి. పదేళ్లుగా వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కే పట్టం కడుతున్న ఓటర్లు.. ఈసారి అనూహ్యంగా కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ వైపు మొగ్గుచూపారు. తాజా కౌంటింగ్ సరళి ప్రకారం యూడీఎఫ్ స్పష్టంగా మ్యాజిక్ ఫిగర్ ను దాటేసింది. 80 కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ బలమైన మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. పదేళ్ల అధికార వ్యతిరేకతతో ఎల్డీఎఫ్ కూటమి తీవ్రంగా నష్టపోయి కేవలం 50 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదాలో కూర్చోబోతోంది. ఇక్కడ బీజేపీ కూటమి కూడా ఖాతా తెరిచి కొన్ని స్థానాల్లో సత్తా చాటుతుండటం విశేషం.

**అసోంలో హ్యాట్రిక్ కొట్టిన కాషాయం..**

ఈశాన్య రాష్ట్రం అసోం శాసనసభలో మొత్తం 126 స్థానాలున్నాయి. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ 64. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి మరోసారి తన ప్రభంజనం సృష్టించింది. వరుసగా మూడోసారి అధికార పీఠాన్ని దక్కించుకుని అరుదైన హ్యాట్రిక్ సాధించింది. ఉదయం నుంచే స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తున్న ఎన్డీఏ కూటమి సులభంగా మ్యాజిక్ ఫిగర్ ను చేరుకుంది. మొత్తం 80 కి పైగా స్థానాల్లో ముందంజలో ఉండి విపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూటమి ఆశించిన స్థాయిలో రాణించలేక కేవలం 35 నుంచి 40 స్థానాలకే పరిమితం కాబోతోంది. స్థానిక ప్రాంతీయ పార్టీలు కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి.

**పుదుచ్చేరిలో మళ్లీ వారే..**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి శాసనసభలో 30 స్థానాలున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 16 స్థానాల బలం కావాలి. ఇక్కడ ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి తన ఆధిపత్యాన్ని పూర్తిస్థాయిలో నిలబెట్టుకుంది. బీజేపీ మద్దతుతో మ్యాజిక్ ఫిగర్ కు కావాల్సిన స్పష్టమైన మెజార్టీని సాధించి మళ్లీ సునాయాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. తాజా ట్రెండ్స్ ప్రకారం ఎన్డీఏ కూటమి 20 కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో దూసుకుపోతోంది. కాంగ్రెస్, డీఎంకే కూటమి ఓటర్లను ఆకర్షించడంలో విఫలమై కేవలం 6 నుంచి 8 స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష హోదా దక్కించుకోబోతోంది. స్వతంత్ర అభ్యర్థులు మిగిలిన ఒకటీ రెండు స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నారు.





# కేరళలో యూడీఎఫ్ విజయంపై రేవంత్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్, మే 04 (సిరి న్యూస్):** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, కూటమి సాధించిన విజయం అసాధారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసి వేణుగోపాల్, దీపాదాస్ మున్షీల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాను కేరళలో ప్రచారంలో పాల్గొన్న సమయంలో అక్కడి ప్రజలు చూపిన ఆదరణను గుర్తు చేసుకున్న ఆయన, యూడీఎఫ్ మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి బలంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు అభివృద్ధిని విశ్వసిస్తాయని, ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని అందించడంతో కొత్త భవిష్యత్తుకు నాంది పలికారని అన్నారు. ఇదే విషయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఈ విజయం ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని తెలిపారు. యూడీఎఫ్‌కు కేరళ ప్రజలు ఇచ్చిన మద్దతు ఆనందదాయకమని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ కూడా స్పందిస్తూ ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన అందించాలనే సంకల్పానికి ఈ విజయం బలాన్నిచ్చిందని అభిప్రాయపడ్డారు.

# మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

**తెలంగాణ బ్యూరో (సిరి న్యూస్):** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కనుగుట్టలో ప్రమాదవశాత్తు వంద ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట దహనం అవడంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పంట దహనమై నష్టపోయిన రైతులతో ఆమె సోమవారం హైదరాబాద్ నుంచి ఫోన్ లో మాట్లాడి ఓదార్చారు. పంట నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. పంట నష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా ఒత్తిడి చేస్తామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న పంట దహనమై నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని ఈ సందర్భంగా కవిత కోరారు. పంటనష్టం అంచనా వేసి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, టీఆర్ఎస్ నాయకులు బానోత్ మౌనికతో కలిసి ఆమె బాధిత రైతులతో మాట్లాడారు.

# రాష్ట్ర ప్రజలు కూడా బీజేపీ వైపే

- వైషమ్యాలు సృష్టించిన ఇండి కూటమికి ప్రజలు బుద్ధి చెప్పారు
- 10న జరిగే బహిరంగ సభా వేదిక వద్ద భూమి పూజ
- ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలి

**హైదరాబాద్, మే 4 (సిరి న్యూస్):** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభ వేదిక వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు ఆధ్వర్యంలో సోమవారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో రామచందర్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను, బీజేపీ విధానాలను, నరేంద్ర మోదీ సుపరిపాలన, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నాయకత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో రాష్ట్రంలో కూడా ప్రజలు బీజేపీ వైపు నిలుస్తారని బలంగా విశ్వసిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్తరాది, దక్షిణాది వైషమ్యాలు సృష్టించిన ఇండి కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే తుడిచి పెట్టుకుపోతుందన్నారు. కూకట్‌పల్లి నుంచి మైనార్టీలు భాజపాలో చేరారని, ముస్లిం మహిళలు మోదీని పెద్దన్నగా భావిస్తున్నారన్నారు. ప్రధాన మంత్రి మోదీ బహిరంగ సభా వేదిక వద్ద భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వ పలు అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు ప్రధాని మోదీ అంకితం చేయనున్నందున ప్రధానికి ఘన స్వాగతం పలకాలని, ప్రతి ఒక్కరూ పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బహిరంగ సభకు రెండు లక్షల మందికిపైగా కార్యకర్తలు, ప్రజలు హాజరవుతారని భావిస్తున్నామని, ఇప్పటికే పార్టీ నాయకులు జిల్లాల వారీగా పర్యటిస్తూ సభకు భారీ స్పందన తీసుకురావడానికి కృషి చేస్తున్నారని చెప్పారు

**ప్రధాని రాక పట్ల ప్రజల్లో ఆసక్తి, ఉత్సాహం**

ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని తెలంగాణలో అడుగు పెడుతుండటంతో రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి, ఉత్సాహం కనిపిస్తోందని డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మోదీ అజెండా



ఎప్పుడూ అభివృద్ధి, పేదల సంక్షేమం, పారదర్శక పాలన అనే అంశాలపైనే ఉంటుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రజలు బీజేపీ, ఎన్డీయే పట్ల విశ్వాసం వ్యక్తం చేస్తూ గెలిపిస్తున్నారని తాజా ఎన్నికల ఫలితాలు మరొకసారి నిరూపించాయని చెప్పారు. అస్సాం మినహా నాలుగు రాష్ట్రాల్లో అవినీతి, కుటుంబ పాలన, ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా అక్కడి ప్రభుత్వాలను ప్రజలు తిరస్కరించారని తెలిపారు. మోదీ ఉన్నచోటే అభివృద్ధి ఉంటుంది అనే విశ్వాసం ప్రజల్లో పెరుగుతోందని, అభివృద్ధి అజెండాతో మోదీ దేశ ప్రజల మన్ననలు పొందుతున్నారని వివరించారు. తెలంగాణలో కూడా ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల పాలనపై విసుగుతో ఉన్నారన్నారు. ఈ రెండు పార్టీలూ రాష్ట్ర సంపదను దుర్వినియోగం చేశాయని, ఒకటి కుటుంబ పాలనతో, మరొకటి దిల్లీలోని కుటుంబ రాజకీయాలే ప్రాధాన్యంగా పనిచేస్తున్నాయని ప్రజలు గ్రహిస్తున్నారని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు కేటాయించిందంటూ ఏ పార్టీ అధికారంలో ఉందనేది కాదు.. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే మోదీ ప్రాధాన్యం అని అన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు, రైతులు.. ఇలా అన్ని వర్గాల ప్రజల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేక భావన స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్న నమ్మకం ప్రజల్లో పెరుగుతోందన్నారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చి ప్రధాన మంత్రి మోదీకి కానుక అందిస్తామని లక్ష్మణ్ చెప్పారు.

# రైతుల ఉసురు పోసుకుంటున్రు..

**మొదటిపేజీ తరువాయి**

కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. శనగలు పోసి నెల రోజులు గడిచినా ఒక్క పైసా అందలేదని, కనీసం సంచులు కూడా లేవని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొక్కజొన్న కొనుగోలు కోసం 750 కేంద్రాలు ఏర్పాటు చేస్తే, నేడు రేవంత్ ప్రభుత్వం కేవలం 80 కేంద్రాలకే పరిమితం చేసిందని విమర్శించారు. 45 డిగ్రీల తీవ్రమైన ఎండలో రైతులు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోతుంటే, ప్రభుత్వం వారిని దళారుల చేతుల్లోకి నెట్టేస్తోందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షం పడితే ధాన్యాన్ని కాపాడేందుకు కనీస సదుపాయాలు లేవని, టార్పాలిన్లు కూడా కరువయ్యాయని మండిపడ్డారు.

**అంకెల్లో మోసం.. కుంభకోణం ఆరోపణలు**

రాష్ట్రవ్యాప్తంగా 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేసిందని మండిపడ్డారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగింది కాబట్టే కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డికి భూముల కొనుగోళ్లు, రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదన్నారు. కనీసం ఒక్క మంత్రి అయినా కొనుగోలు కేంద్రాలను సందర్శించారా? అని ప్రశ్నించారు. మంత్రి దామోదర రాజనర్సింహ గతంలో రాసిన లేఖే రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న వివక్షకు నిదర్శనమన్నారు. వచ్చే వారం రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ధైర్యం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎటువంటి షరతులు లేకుండా మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి, ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, పాడి కౌశిక్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు బిక్షపతి, శివరాజ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర కృషితోనే బీసీల సామాజికఆర్థికాభివృద్ధి

- కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాంశ్

**హైదరాబాద్, మే 4 (సిరి న్యూస్):** సమాజంలోని వెనుకబడిన, బలహీనవర్గాల సామాజికఆర్థికాభివృద్ధి కోసం నిరంతర కృషి అవసరమని కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ పేర్కొన్నారు. ఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సచివాలయంలో ఆయన □ సోమవారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పేద, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అమలవుతున్న ముఖ్య సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించారు. వీటిలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ విద్యార్థి స్కాలర్‌షిప్స్, పౌర హక్కుల రక్షణ వ్యవస్థ, ఎస్సీ/బీసీ హాస్టళ్ల నిర్మాణం, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సమగ్ర పునరావాసం, జాతీయ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ వంటి అంశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా సుధాంశ్ పంత్ మాట్లాడుతూ కేంద్ర పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని ప్రశంసించారు. గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ మరింత కృషి చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన పెండింగ్ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరింత ఆర్థిక సహాయం పొందడానికి ఆస్కారం ఉందని, దీని ద్వారా అర్హులైన లబ్ధిదారులకు మరింత విస్తృత ప్రయోజనాలు అందుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ పేరెంటల్ సపోర్ట్ చట్టాన్ని ఒక ప్రగతిశీల చర్యగా ప్రశంసిస్తూ సామాజిక రక్షణలో ఇది ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ కేంద్ర పథకాల ప్రస్తుత స్థితిపై సబ్యసాచి ఘోష్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, కొనసాగుతున్న కార్యక్రమాలు, అమలు విధానాలను వివరించడంతోటు కేంద్రం నుండి మద్దతు, స్పష్టత అవసరమైన కొన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ, బీసీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, ఇతర సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఐక్యత, అభివృద్ధికి పెద్ద పీట

**హైదరాబాద్, మే 4 :** అధికారం ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగబద్ధమైన విలువల కోసమే పోరాడుతుందని, కేరళంలో విజయం ఆ పోరాటానికి దక్కిన గుర్తింపు అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.నైదు రాష్ట్రాల్లో ఇటీవలి ఎన్నికలకు సంబంధించిన ఫలితాలపై ఆయన మాట్లాడుతూ కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన ఘన విజయం ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని, విద్వేషపు రాజకీయాలపై వివేకపు గెలుపు అని పేర్కొన్నారు. విభజన రాజకీయాల కంటే అభివృద్ధి, ఐక్యత, లౌకిక విలువలకే ప్రజలు పెద్దపీట వేస్తారని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయన్నారు. కేరళం ప్రజలు విద్వేషానికి తావు లేకుండా అభివృద్ధిని, ఐక్యతను ఎంచుకుని దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కేరళంతోపాటు ఇతర రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు ప్రదర్శించిన పోరాట పటిమ అభినందనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి అహర్నిశలు శ్రమించిన ప్రతి కార్యకర్తకు, తమపై నమ్మకం ఉంచిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం ఎప్పుడూ మనుషులను కలపడమే కానీ విడదీయడం కాదు.. కాంగ్రెస్ ప్రయాణం ఎప్పుడూ ప్రజల హితం కోసమే.. రాహుల్ గాంధీ నాయకత్వంలో తాము నమ్ముకున్న 'ప్రేమ - సామాజిక న్యాయం' అనే మార్గమే సరైనదని కేరళం తీర్పు బలపరిచిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లోనూ ముందుకు సాగుతామన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెండోసారి అధికారంలోకి వస్తామని, ఇందులో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తామన్నారు. 2029లో దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధిస్తుందని, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళంలో ఘన విజయం సాధించిన ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలను శ్రీధర్ బాబు ఫోన్ లో అభినందించారు.

# వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

**హైదరాబాద్, మే 4 (సిరి న్యూస్)** అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లాల ఇంచార్జ్ మంత్రులు, కలెక్టర్లు మరియు ఉన్నతాధికారులతో మంత్రి అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతుల ఖాతాల్లో రూ. 2001.96 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ధాన్యం కేంద్రాలకు చేరే అవకాశమున్నందున కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ముఖ్యంగా నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా, అకాల వర్షాల కారణంగా సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో సుమారు 299 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు సమాచారం అందిందని మంత్రి తెలిపారు. తడిసిన ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాబోయే 3-4 రోజులు అకాల వర్షాలు సంభవించే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌ల వినియోగంతో వర్షాల ప్రభావం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాల ప్రభావం రైతులపై పడకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# మోదీ అభివృద్ధి అజెండాకు ప్రజల మద్దతు

- **బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్**
- **మూడు రాష్ట్రాల్లో విజయంతో బీజేపీ సంబరాలు**

**హైదరాబాద్, మే 4 (సిరి న్యూస్):**

అసోం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలో బీజేపీ కూటమి ఘన విజయం సాధించడంతో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో భారీగా సంబురాలు జరుపుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు కలిసి స్వీట్లు పంచుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ ఈరోజు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో అసోం, బెంగాల్, పుదుచ్చేరిలో బీజేపీ కూటమి విజయం సాధించడం ఆనందకరమన్నారు. మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పాలనలో జరిగిన అరాచకాలు, అవినీతి, చొరబాటుదారులకు ప్రోత్సాహం ఇవన్నీ ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే జరిగినవని, ఈసారి ప్రజాశక్తి ఏంటో చూపించి అరాచక పాలనకు చెక్ పెట్టారని తెలిపారు. ఈ ఎన్నికలను విశ్లేషిస్తే పన్నెండేళ్లుగా మోదీ ప్రభుత్వ అభివృద్ధి అజెండాకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష లేకుండా పేదలను పేదలుగానే పరిగణించడం వల్లే ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ఇపుడు తెలంగాణ ప్రజల్లో కూడా మోదీ పట్ల అమిత ఆసక్తి కనిపిస్తోందని, అభివృద్ధినే వారు కోరుతున్నారని అన్నారు. గత పదేళ్లుగా బీఆరఎస్, రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ రాష్ట్ర సంపదను దోచుకున్నాయని ఆరోపించారు. అభివృద్ధి, పారదర్శక సంక్షేమ పథకాలు అమలు చేసిన రాష్ట్రాల్లో ప్రజలు మళ్లీ అదే ప్రభుత్వాలకు మద్దతు ఇచ్చారు. అస్సాం, పుదుచ్చేరి వంటి రాష్ట్రాల్లో ప్రోఇన్‌కంబెన్సీ ఓటు రావడం దీనికి ఉదాహరణ. అదే సమయంలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, లెఫ్ట్ పాలిత ప్రాంతాల్లో అవినీతి, బంధుప్రీతి, మంత్రుల అరెస్టులు వంటి ఘటనలు ప్రజల ముందుకు వచ్చాయన్నారు.

**ప్రధాని పర్యటనతో రాష్ట్రంలో పెను మార్పులు**

ఈనెల 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనతో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజల్లో ఆకాంక్ష నెలకొందన్నారు. ఆ లక్ష్యంతో, కృతనిశ్చయంతో పార్టీ పనిచేస్తోందన్నారు. గత 12 సంవత్సరాల్లో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం సుమారు రూ.15 లక్షల కోట్ల కేటాయించిందని, రైల్వేలు, జాతీయ రహదారులు, ఎయిమ్స్, గిరిజన విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రాజెక్టులు వచ్చాయని, ఈ అభివృద్ధి వల్లే ప్రజల్లో మోదీ పట్ల మరింత సానుకూలత పెరిగిందని చెప్పారు. సికింద్రాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివచ్చి ఆశీర్వదించాలని కోరారు. బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చి అది మోదీకి మనం అందించే గొప్ప కానుకగా మారాలని విశ్వసిస్తున్నానన్నారు. బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మించిన పశ్చిమ బెంగాల్‌లో ఆయన కలలుగన్న దిశగా ఈరోజు ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారం సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. 2011లో ఒక్క సీటు కూడా లేని పరిస్థితి నుంచి ఈరోజు టూథర్డ్ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయికి రావడం అక్కడి ప్రజలు మోదీ నాయకత్వాన్ని ఎంతగా విశ్వసించారో స్పష్టంగా చూపిస్తోందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు నాయకత్వంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు.

## రెండు కార్పొరేషన్లు, ఐదు పురాల్లో
# స్పెషలాఫీసర్ పాలన

- **ఈ నెల 6న ముగియనున్న పాలక వర్గాల గడువు**

**తెలంగాణ బ్యూరో (సిరి న్యూస్):**

రాష్ట్రంలోని గ్రేటర్ వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లతోపాటు మరో ఐదు మున్సిపాలిటీల్లో పాలకవర్గాల గడువు ఈనెల 6వ తేదిన ముగియనుంది. దీంతో పాలకవర్గం గడువు ముగిసిన వెంటనే స్పెషల్ ఆఫీసర్ విధించనున్నారు. ఇప్పటికే ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు కొలువుదీరిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలను మినహాయిస్తే 130 పట్టణ స్తానిక సంస్థలు ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, అచ్చంపేట, సిద్దిపేట, జడ్చర్ల, కొత్తూరు, నకిరకల్ మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది.

**10యూఎల్బీలకు ఒకేసారి..**

రాష్ట్రంలోని 10 పట్టణ స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఒకే సారి ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉన్నట్టు అధికారులు తెలిపారు.. జీహెచ్ఎంసీతోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన సీఎంసీ, ఎంఎంసీ, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతోపాటు జడ్చర్ల, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట్ మున్సిపాలిటీలకు ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. క్యూర్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లలో ఇప్పటికే వార్డుల పునర్విభజన కూడా ఫైనల్ చేసిన విషయం విధితమే. జనగణన తర్వాత ఎంటీపీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముగిసిన తర్వాత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

# యువ ఇంజనీర్ల శిక్షణ బాధ్యతను పరిశ్రమలు స్వీకరించాలి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్ మే04 (సిరి న్యూస్)**



తెలంగాణాలో ఏటా చదువులు పూర్తి చేసుకుంటున్న 2 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణనిచ్చి, ఉద్యోగాలకు సంసిద్ధులను చేసే కర్తవ్యాన్ని పరిశ్రమలు స్వీకరించాలని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. యూనివర్సిటీ చదువులకు, ఇండస్ట్రీ అవసరాలకు అంతరం పెరిగినందున ప్రతి సంస్థ తమ బాధ్యతగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని శ్రీధర్ బాబు సూచించారు. నగరానికి చెందిన పిఎస్ ఆర్ టెక్ హబ్ (PSR Techhub) సంస్థ పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నాడు బేగంపేటలోని వివాంతా హోటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. టెక్నాలజి రంగంలో నిత్యం ఎదురయ్యే పెను సవాళ్లను అధిగమించి పదేళ్లలో రూ.120 కోట్ల సంస్థగా నిలదొక్కుకునేలా చేయడం పట్ల పిఎస్ టెక్ హబ్ అధినేత పి. శ్రీరంగారావును శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. కరోనా సమయంలో ఎన్నో సంస్థలు మూతపడటమో, నష్టాలకు గురికావడమో జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. టెక్నాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక ఆవిష్కరణలు, ఏఐ లాంటి సవాళ్లను ఎదుర్కొని 250 మంది ఉద్యోగులకు భరోసానివ్వడం సాధారణ విషయం కాదని శ్రీధర్ బాబు కొనియాడారు. వేగంగా విస్తరిస్తున్న ఏఐ ప్రభావాన్ని ఎదుర్కొనేలా వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్ల నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని తెలిపారు. 'ఏఐ హబ్' పేరుతో ప్రత్యేక శిక్షణ సంస్థను ఏర్పాటు చేసి వచ్చే రెండు నెలల్లో రీస్కిల్లింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తామని శ్రీధర్ బాబు వెల్లడించారు.

భారీ విస్తరణకు ప్రణాళికలు: పిఎస్ ఆర్ టెక్ హబ్ దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లో కార్యాలయాలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తోందని డైరెక్టర్ పి. నమ్యిత తెలిపారు. వచ్చే మూడేళ్లలో దేశం వెలుపల కార్యాలయాలను విస్తరించి ఉద్యోగుల సంఖ్యను 1,000 కి పెంచుతామని వివరించారు. మంత్రి సూచన మేరకు చదువులు పూర్తయిన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు శిక్షణనిచ్చి, ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, క్లయింట్లు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ విద్యుత్ అక్రమాల విచారణ సీబీఐకి అప్పగింత

**తెలంగాణ బ్యూరో :**

గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన కమిషన్ నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ విస్తరణలో మంత్రివర్గం దీనికి ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ భేటీలో మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకున్నది. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి మంత్రివర్గ భేటీలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై ప్రభుత్వం విచారణ కమిషన్ ను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. 2024 మార్చి 14వ తేదీన కమిషన్స్ ఆఫ్ ఇన్వైరీ చట్టం ప్రకారం రిటైర్డ్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు 2024 జులైలో ఆయన విచారణ నుంచి తప్పుకోవటంతో జస్టిస్ మదన్ బి. లోకూర్‌ను కమిషన్‌గా నియమించారన్నారు. 2024 అక్టోబర్లో కమిషన్ మొత్తం 114 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని తెలిపారు. అనంతరం గతేడాది జనవరి 4న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నివేదికపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించిందన్నారు. నివేదికను పరిశీలించిన అడ్వకేట్ జనరల్ తన సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారనీ వాటన్నింటినీ ఈ రోజు కేబినెట్ చర్చించిందని మంత్రి వివరించారు. ప్రధానంగా అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఈ కేసులో ఉన్నాయన్న ఆయన అందుకే నిష్పాక్షిక దర్యాప్తు జరిపేందుకు సీబీఐ విచారణ అప్పగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

2. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈనెల చివరి వారంలో సవరించిన విలువలు అమల్లోకి వస్తాయి. వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉన్నారు. ధర పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందిస్తున్నారు. దీంతో పాటు వాస్తవంగా మార్కెట్ లో ఉన్న ధరలతో పోలిస్తే ప్రభుత్వం నిర్ణయించిన భూముల ధరలు భారీగా వ్యత్యాసమున్నాయి. అందుకు శాస్త్రీయ పద్ధతి అనుసరించి ఈ ధరలను సవరించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిల్లాల్లో ఉండే మార్కెట్ విలువల రివిజన్ కమిటీలు అన్ని విషయాలను దృష్టిలో పెట్టుకుని విలువలను సవరిస్తుంది.

3. హిల్ట్ పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఒక అవకాశం ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. భూముల ధరలు పెరిగే లోపు దరఖాస్తు చేసుకున్న వారికి ముందుగా పది శాతం చెల్లించే వెసులుబాటు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. వారికి ఇప్పుడున్న భూముల ధరలే వర్తిస్తాయి. మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించాల్సి ఉంటుంది.

4. అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లిన వివరాలు జిల్లా ఇన్ ఛార్జీ మంత్రులు తెప్పించుకుని రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 5. నల్గొండరంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డుకు అప్పగించే ఎంవోయూకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ( నార్మాక్) కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్డీడీబీ నిర్వహిస్తుంది.

6. రాష్ట్రంలో 9 జిల్లాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్ల వద్ద సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. పైలెట్ పద్ధతిన 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది.

7. క్యూర్ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్లలో పెండింగ్ లో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పన్నులను క్లియర్ చేరుకునేందుకు వన్ టైమ్ సెటిల్ మెంట్ (ఓటీఎస్) వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 5864 కోట్ల బకాయిలున్నాయి. జరిమానాలు, వడ్డీలన్నీ మినహాయించి వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా రూ.1686 కోట్లు వస్తాయని అంచనా వేసింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలోనే వన్ టైమ్ సెటిల్మెంట్ పై ఈ బకాయిలు వసూలు చేసుకోవాలని మున్సిపల్ శాఖను ఆదేశించింది. హైదరాబాద్ జల మండలికి ఇవ్వాల్సిన నీటి బకాయిలను కూడా సర్దుబాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.

8. ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీరు అందించనున్నారు.

9. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలు (అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్లు), పాలిటెక్నిక్లు, టీ శాట్ ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చి, ఒకే గొడుగు కింద ఉంచాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

10. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్ నగర్లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం తెలిపింది.

# ప్రజలే తమ ఆస్తులను, ప్రాణాలను కాపాడుకోవాలి: కేటీఆర్

- **శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం విఫలం – తీవ్ర ఆరోపణలు**

**హైదరాబాద్, మే 4 (సిరి న్యూస్)**



రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని, ప్రజలే తమ రక్షణ బాధ్యతను స్వయంగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ K. T. Rama Rao (కేటీఆర్) అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజలు ప్రభుత్వంపై ఆధారపడకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, ప్రైవేట్ భద్రతా సిబ్బందిని నియమించుకోవడం, గ్రామాలు-పట్టణాల్లో యువత గస్తీ బృందాలుగా ఏర్పడి అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీలు, కాల్పులు ప్రజల్లో భయాందోళనలు పెంచుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి హోంమంత్రి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నప్పటికీ, నేరాలను అరికట్టడంలో విఫలమయ్యారని కేటీఆర్ ఆరోపించారు. కరీంనగర్‌లో జరిగిన దోపిడీ ఘటనలో నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఘటన జరిగిన రెండు రోజులు గడిచినా ఎవరినీ అరెస్ట్ చేయకపోవడం బాధాకరమన్నారు. కరీంనగర్‌లో దోపిడీ ఘటన బాధితులను స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి కేటీఆర్ పరామర్శించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల పరిస్థితిని తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. బాధితులు తీవ్ర భయాందోళనలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని, సీసీ కెమెరాల ఏర్పాటు, ఆధునిక సదుపాయాలతో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రస్తుతం పోలీసులను రాజకీయాల కోసం వినియోగించడం వల్లే పరిస్థితి దిగజారిందని ఆరోపించారు. ఇక కేంద్ర సహాయ హోంమంత్రి Bandi Sanjay Kumarపై కూడా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కరీంనగర్ లాంటి ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతుండగా ఆయన స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఆయన మౌనం పాటిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఒకప్పుడు ఉన్న భద్రతా పరిస్థితులు ఇప్పుడు కనిపించడం లేదని, త్వరలోనే ప్రజలు మార్పు కోరుకుంటారని కేటీఆర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో తిరిగి తమ ప్రభుత్వం ఏర్పడితే శాంతిభద్రతలను కట్టుదిట్టం చేస్తామని హామీ ఇచ్చారు.



## పీఏసీఎస్ ఎన్నికలపై ప్రభుత్వానికి హైకోర్టు షాక్

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించకుండా, తమకు నచ్చిన వారికి నామినేటెడ్ కమిటీలను నియమించాలని చూసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ మేరకు నామినేటెడ్ పాలకవర్గాల నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల (G.O.Rt.No.597) పై హైకోర్టు స్టే విధించింది. మెమో నెం. 8719/2018/PACSV ద్వారా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తాజా సహకార సంఘాల పాలక వర్గాలకు అవకాశం ఇస్తున్నట్లు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీల తరహాలో నామినేటెడ్ కమిటీలను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు సోమవారం విచారించింది. గత ప్రభుత్వం తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్వ్యాప్తంగా పీఏసీఎస్ పాలకవర్గాలను, డీసీసీబీ బోర్డులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# రెడ్ హ్యాండెడ్గా ఏసీబీ కి చిక్కిన అసిస్టెంట్ శ్రీలత

**హైదరాబాద్ (సిరి న్యూస్):**

రాష్ట్రంలోఅవినీతి నిరోధక శాఖ అధికారులు వరుస దాడులు నిర్వహిస్తున్నప్పటికీ కొన్ని శాఖల్లో అధికారులు, సిబ్బంది తీరు మాత్రం మారడం లేదు. డబ్బులిస్తేనే పనవుతుందని, ఫైళ్లు కదులుతాయని మధ్యవర్తులతో చెప్పిస్తున్నారు. అడిగినంత సమర్పించుకుంటేనే పని జరుగుతుందని వసూళ్ల దందా సాగిస్తున్నారు. తాజాగా బోరబండలో లంచం తీసుకుంటూ ఓ అధికారిణి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కారు. రోజుల వ్య వధిలోనే పలువురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం కలకలం రేపుతోంది. బోరబండ జీహెచ్ఎంసీ ఆఫీసులో ఏసీబీ తనిఖీలు నిర్వహించింది. జూనియర్ అసిస్టెంట్ శ్రీలత రూ.లక్ష లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి. హౌస్ కన్స్ట్రక్షన్ కోసం ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేసిందని, ఇవాళ ఓ సూపర్ మార్కెట్ వద్ద జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నామని అధికారులు వివరించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం వికారాబాద్ జిల్లా తాండూర్ ఎస్ వి ఆర్ ఫంక్షన్ హాలు నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు వారోత్స వాల కార్యక్రమం లో ముఖ్య "అతిధి గా పాల్గొని మాట్లాడారు. జిల్లా లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈరోజు నుండి మే 9 వరకు రైతు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ గీతం తో పాటు జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు ప్రయత్నం చేయకపోతే భవిష్యత్తు లో భూమి మొత్తం నిస్థార మవుతుందని, తక్కువ పెట్టుబడి తో ఎక్కువ పంటలు పండించేలా రైతులు ముందుకెళ్లాలని, ఆర్గానిక్ పంటల సాగు పై రైతులు దృష్టి పెట్టాలన్నారు. భూములను రక్షించి ప్రకృతి వ్యవసాయం చేసి ప్రజల ఆరోగ్యాన్నికాపాడుకోవాలన్నారు. సైంటిస్ట్ లు భూమిని ఎ రకంగా సంరక్షించు కోవాలో అవగాహనా కలిపిస్తారని తెలిపారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయుటకు ఒక లక్షా 40 వేల కోట్లు రైతుల ఖాతాల లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి గారి ప్రయత్నం తో 90 కోట్ల మంజూరు తో కోట్ పల్లి ప్రాజెక్టు తెచ్చారని, 40 నుండి 50 వేల క్వింటాల దాక మొక్క జొన్న పండడిస్తున్నామని, భారత దేశం లో అత్యధిక పంటలు పండించే రైతులు తెలంగాణ రైతు లేనని, ప్రభుత్వం ఎక్కువ మొత్తం లో వరి కొనుగోలు చేస్తుందని అన్నారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజ మాన్యం, ప్రకృతి వ్యవసాయం, పై అవగాహనా కలిపించు కోవాలన్నారు. ప్రకృతి పంటలు పండించిన లావణ్య రెడ్డి తో కలిసి టి జి ఆన్లైన్ యాప్ ను ప్రారంభించారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, మత్స్య శాఖ వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు . స్థానిక శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రైతే రాజు, రైతు దేశానికి వెన్నెముక వంటి వాడు, వ్యవసాయం దండగ కాదు., వ్యవసాయం ఒక పండుగ, మంత్రి చొరవ తో వ్యవసాయ రంగాన్నే ముందుకు తీసుకెళ్తున్నారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే అభివృద్ధి జరగా లనే ఉద్దేశం తో రైతులు ప్రకృతి పంటల సాగు పై దృష్టి పెట్టాలన్నారు. ఎ ఓ లు, సైంటిస్ట్ ల సూచనలు పాటించి పొలాల్లో ఏయే పంటలు వేస్తే బాగుంటుందని వాటి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. 14 వేల కోట్లు మార్కెట్ కోసం మంజూరై య్యాని, అయిల్ ఫామ్ కంపెనీ జిల్లా కు మంజూరు ఐనదని, తాండూర్ కంది. పప్పుకు చాలా ప్రాముఖ్యత ఉందని, కంది బోర్డు ఏర్పాటు చేయాలనీ ఈ సందర్భంగా మంత్రి గారిని కోరారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రజా పాలనా ప్రగతిప్రణాళిక లో భాగంగా ఈరోజు నుండి మే 9 వరకు రైతు వారోస్తావాలు ప్రారంభం, రైతులకు సంబందించి రైతు భరోసా, రైతు భీమా, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలపై వివరించడం, వారి సలహాలు సూచనలు. తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రైతులు, పలువురు. సైంటిస్ట్ లు మాట్లాడారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ కల్వ సుజాత, మార్కెట్ చైర్మన్ లు, ఎఎంసి చైర్మన్ లు, ఆత్మ చైర్మన్ లు, వ్యవసాయ శాఖ సిబ్బంది. ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

**మొక్కజొన్న, జొన్నను పిఎస్ఎస్‌లో చేర్చాలి**

**శనగ, పొద్దురుగుడుపై 25శాతం పరిమితిని ఎతివేయాలి**

మొక్కజొన్న, జొన్న పంటలను పీఎస్ఎస్‌లో చేర్చి శనగ, పొద్దుతిరుగుడు పంటలపై ఉన్న 25శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మరోమారు లేఖ ద్వారా కోరారు. రాష్ట్రంలో యాసంగిలో పండించిన వేరుశనగ, పొద్దుతిరుగుడు వంటి పంటలపై ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితులను కేంద్రం ఎత్తివేయాలని కోరారు. కేంద్ర పరిమితులతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని వివరించారు. సెంట్రల్ పూల్‌లో కేంద్ర నోడల్ సంస్థ ద్వారా శనగ పంటను 29,860 మెట్రిక్ టన్నులు (మొత్తం ఉత్పత్తిలో 25శాతం) కొనుగోలు చేయడానికి, అలాగే పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 3690 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి కేంద్రం అనుమతించిందని, అయితే ఆ ప్రకారం కొనుగోలు గత వారమే పూర్తయిందని తెలిపారు. ఇంకా రైతుల వద్ద పంట మిగిలి ఉందని, మార్కెట్లకు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం అనుమతించిన పరిమితులను ఇప్పటికే దాటినందున శనగ పంటల కొనుగోలు పరిమితిని 1,12,077 మెట్రిక్ టన్నులకు పెంచాలని, పొద్దుతిరుగుడు పంటల కొనుగోళ్లను 10,839 మెట్రిక్ టన్నులకు పెంచాలని మంత్రి కోరారు. రాష్టంలో విస్తృతంగా పండే మొక్కజొన్న, జొన్న పంటను కేంద్రం పీఎసఎస్‌లో చేర్చి కేంద్ర నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేపట్టాలని మంత్రి డిమాండ్ చేశారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర రానందున ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్ల కోసం 246 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రస్తుత రబీలో సుమారు 3.99 లక్షల మెట్రిక్ టన్నులు ఎంఎస్పీ వద్ద కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. గత ఖరీఫ్‌లో కూడా రాష్ట్రం సుమారు 3.76 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసి రూ.902.80 కోట్ల వ్యయం భరించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం తక్షణం జోక్యం చేసుకుని ధర మద్దతు పథకంలో మొక్కజొన్న, జొన్న పంటలను చేర్చాలని కోరారు.

# దేవాలయాలు ఆధ్యాత్మికతతో సమాజ ఐక్యతకు ప్రతీకలు

- అంబేద్కర్ కాలనీలో పోచమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన
- భూమి పూజ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పది లక్షల సొంత నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టిన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



**గుమ్మడిదల, మే 4 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీలోని 15వ వార్డులోని అంబేద్కర్ కాలనీలో పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన ట్రస్ట్ ద్వారా సొంత నిధులతో దేవాలయం నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజ కార్యక్రమలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా సమాజంలో ఐక్యత, సామరస్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ సొంత నిధులతో ఆలయ నిర్మాణం చేపట్టడం ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా సేవలో ఆయన చూపుతున్న నిబద్ధత ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ కాలనీ ప్రజల అభీష్టం మేరకు పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి ముందుకు వచ్చామని తెలిపారు. ట్రస్ట్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి, సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు తోడ్పడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్యారెడ్డి, కౌన్సిలర్లు సంజీవరెడ్డి, కుమార్ గౌడ్, రాజశేఖర్, కిషన్, మురళి, చక్రపాణి, విజయలక్ష్మి ప్రమీల, సోనీ, కో-ఆప్షన్ సభ్యుడు విజయ భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్ రెడ్డి, నాయకులు హుస్సేన్, వెంకట్ రామ్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, వెంకటేష్ గౌడ్, తుపాకుల రాజు, శేఖర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ సంఘం సభ్యులు రామచంద్రయ్య, డప్పు శ్రీను, సుధాకర్, బాలేష్, రమేష్ తదితరులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగా వితరణ



**కొండాపూర్, మే 4(సిరిన్యూస్ )**

వేసవి తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ( శరీరం చల్లదనం)ఉపశమనం కలిగించేందుకు ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. సోమవారం గొల్లపల్లిలో పనిచేస్తున్న 200 మంది ఉపాధి కూలీలకు గ్రామ యువకుడు అమరేందర్ రెడ్డి వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువులు కూలీలు మాట్లాడుతూ ఎండ తీవ్రతను అధికమించేందుకు యువకునికి అందించిన మజ్జిగ సేవా కార్యక్రమం మంచి పరిణామంగా అభినందనీయమన్నారు. ముున్ముందు మరిన్ని స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

# చెరువుల పునరుద్ధరణతో నీటి నిల్వలు పెంపు

- రైతులకు లాభం
- చైర్మన్ కుమార్ గౌడ్
- న్యూలాండ్ పరిశ్రమ సహకారంతో మెలకుంట పనులకు శ్రీకారం




**గుమ్మడిదల, మే 4 (సిరి న్యూస్)**

భూగర్భ జలాల స్థాయిని పెంచడం, పర్యావరణ పరిరక్షణను బలోపేతం చేయడం లక్ష్యంగా జలవనరుల పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలోని మెలకుంట నీటివనరును న్యూలాండ్ పరిశ్రమ, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర జలవనరుల నిర్వహణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంతో మెలకుంట రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. చెరువులను పునరుద్ధరించడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి సాగునీటి లభ్యత మెరుగు పడుతుందన్నారు. రైతులకు దీని వల్ల ప్రయోజనం కలుగుతుందని వివరించారు. వేసవి కాలంలో పశువులకు తాగునీటి కొరత కూడా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు.సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి జలవనరుల పునరుద్ధరణలో భాగస్వామ్యం అవుతున్న స్వచ్ఛంద సంస్థల సేవలను ఆయన అభినందించారు. గ్రామస్థులు, రైతులు కలిసి నీటివనరులను సంరక్షించుకోవాలని, జల సంరక్షణ ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య రెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, పరిశ్రమ ప్రతినిధి డీ.వీ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు సోనీ రెడ్డి, ఆకుల మాధవి, పొన్నాల ప్రమీల, రాజశేఖర్, రాజి రెడ్డి, కుమార్ గౌడ్, సంజీవ రెడ్డి, చక్రపాణి, కో-ఆప్షన్ సభ్యులు భాస్కర్ రెడ్డి, నాయకులు శేఖర్ రెడ్డి, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మునిపల్లిలో రైతు వారోత్సవం



**మునిపల్లి, మే 4 (సిరి న్యూస్):**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో సోమవారం మునిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతు వారోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి రైతులకు పలు వ్యవసాయ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంట రుణాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి కీలక అంశాలపై వివరించారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి దిగుబడులు పెంచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ విజయ్,వ్యవసాయ అధికారి సత్యనారాయణ,రహ్మాన్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కామాంధుడికి 20 ఏళ్ల జైలు!

- చారిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు
- రూ. 8 వేల జరిమానా సైతం
- పోలీసుల దర్యాప్తును అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, (సిరి న్యూస్)**

సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడికి సంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. సోమవారం వెలువడిన ఈ తీర్పులో నిందితుడు శాంసన్ అలియాస్ మేథారి శాంసన్ (20)ను దోషిగా తేలుస్తూ న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన నిందితుడు శాంసన్, 2023లో సదాశివపేట పరిధిలో ఒక మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడటంతో పోలీసులు క్రైమ్ నం. 45/2023 కింద పోక్సో చట్టంతో పాటు ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. విచారణాధికారి కె. నవీన్ కుమార్ నేతృత్వంలో పోలీసులు పక్కా ఆధారాలను కోర్టుకు సమర్పించగా, నేరం నిరూపితం కావడంతో న్యాయస్థానం ఈ శిక్షను ఖరారు చేసింది. జైలు శిక్షతో పాటు 8 వేల రూపాయల జరిమానాను కూడా విధించింది. ఒకవేళ జరిమానా చెల్లించకపోతే మరో 5 నెలల సాధారణ శిక్ష అనుభవించాలని స్పష్టం చేసింది. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన స్పెషల్ పీపీ బి. సూర్యరెడ్డిని, కేస్ దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ప్రస్తుత ఎస్‌హెచ్ఓ వెంకటేష్ మరియు కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రత్యేకంగా అభినందించారు. నేరస్తులకు శిక్ష పడటంలో పోలీసులు చూపుతున్న చొరవ బాధితులకు భరోసా ఇస్తుందని ఎస్పీ పేర్కొన్నారు.

# రైతుబంధు, బీమాపై అవగాహన సదస్సు





**రామాయంపేట, మే 4 (సిరి న్యూస్)**

రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం నాడు ఏఈఓ ఆధ్వర్యంలో అక్కన్నపేట రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు పంటలపై,అదే విధంగా రైతుబంధుపై,రైతు బీమాపై అవగాహన కల్పించడం జరిగింది అందులో భాగంగా రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపకుండా పామాయిల్ వైపు మొగ్గు చూపాలని రైతులకు సూచించారు. మట్టి నమూనాలను సేకరించి దానికి సంబంధించిన పంటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అక్కన్న పేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, జాన్సీ లింగాపూర్ సర్పంచ్ మానెగల రామకృష్ణయ్య ,గ్రామ సెక్రెటరీ ఏఈఓ శ్రీనివాస్ ,గ్రామ రైతులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# శ్రీ జగదాంబ మాత సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ దేవాలయాలలో ప్రత్యేక పూజలు





- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి!!

**శివంపేట మే 4 (సిరి న్యూస్ )**

శివంపేట మండల కేంద్రంలోని భీమ్లా తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని శంకర్ తండాలో శ్రీ శ్రీ జగదాంబ మాత మరియు శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయాలను నర్సాపూర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి దేవాలయాలను దర్శించుకున్నారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ని ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ శ్రీ జగదాంబ మాత సేవలాల్ మహారాజ్ ఆశీర్వాదంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో పాడిపంటలతో ఉండాలని ఆ దేవుని వేడుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో శివంపేట్ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాజా రమణా గౌడ్, సీనియర్ నాయకులు కృష్ణారావు, బీసీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, ఉసిరిక పల్లి సర్పంచ్ మర్రి సబితా కృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ పోతరాజు బాబురావు , శంకర్ తండా సేవలాల్ దేవాలయం ఉత్సవ కమిటీ సభ్యులు బాలు నాయక్ విటల్ దశరథ్ జైల్ సింగ్ భాస్కర్ వసంత్ రావు థౌర్య దీప్లా రవీందర్, జగన్ టిఆర్ఎస్ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు , పాల్గొన్నారు.

## కొంపల్లి సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ ని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కొంపల్లి.మే.04(సిరి న్యూస్).**

కొంపల్లి సర్కిల్ కార్యాలయనికి నూతనంగా డిప్యూటీ కమిషనర్ గ విధులు నిర్వహించడానికి వచ్చిన నూతన డి.లావణ్యని కొంపల్లి పట్టణ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడ్చల్–మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్ తో కలిసి పార్టీ సీనియర్ నాయకులు పుష్పగుచ్ఛము అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అన్నారం గోపాల్ రెడ్డి. లేబర్ సెల్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి.జయభేరి గోపాల్ రెడ్డి.అశోక్ రెడ్డి.ఎత్తిరాజులు పూర్ణచందర్ రావ్.దశరథ.ఇబ్రహీం.అంజి ముదిరాజ్ పాల్గొన్నారు.

## అక్కన్నపేటలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం




**రామాయంపేట, మే 4( సిరి న్యూస్)**

రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో సోమవారం నాడు ఉపాధి హామీ పనిలో భాగంగా సోషల్ ఆడిట్ డి ఆర్ పి రమ్య ఉపాధి కూలీలతో మాట్లాడి ఉపాధి హామీ పనిలో భాగంగా మాస్టర్స్ గురించి తెలపడం జరిగింది .కూలీలకు రోజువారీ వేతనాల గురించి తెలపడం జరిగింది .పరిశీలించడం జరిగింది .అటెండెన్స్ లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు తెలపడం జరిగింది.ఉపాధి కూలీలలో ఎలాంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలపడం జరిగింది .ఈ కార్యక్రమంలో అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి ఉపాధి కూలీలకు గ్లూకోజ్ పౌడర్ ప్యాకెట్లు అందజేయడం జరిగింది. అదేవిధంగా వారికి రోజు మంచినీటి సరఫరా కూడా చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది .కూలీలకు వారు చేసిన పనికి డబ్బులు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని చెప్పడం జరిగింది.

## నీటి కోసం తిప్పలు!

### భగీరథ నీరందక ప్రజల అవస్థలు
### 10 రోజులుగా నిలిచిపోయిన సరఫరా
### అధికారులు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి




**గుమ్మడిదల, మే 4 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మండల పరిధిలోని రామ్‌రెడ్డి బావి గ్రామంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొంది. గత పది రోజులుగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకుకు మిషన్ భగీరథ పైపులైన్ ద్వారానే నీటి సరఫరా జరుగుతుండగా, ప్రస్తుతం అది నిలిచిపోవడంతో ఇంటింటికి వెళ్లే నల్లాలలో నీరు రాకపోవడం పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చింది. ప్రత్యామ్నాయంగా గ్రామంలో ఉన్న బోర్ల ద్వారా సరఫరా చేసే నీరు సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర కష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో బోర్ల నుండి కూడా తగినంత నీటి సరఫరా లేకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమైంది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. వేసవి కాలంలోనే ఈ పరిస్థితి రావడం ప్రజల ఆందోళనను మరింత పెంచుతోంది. ఇప్పటికైనా సంబంధిత మిషన్ భగీరథ అధికారులు స్పందించి, సమస్యను తక్షణమే పరిష్కరించి గ్రామానికి నీటి సరఫరా పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అంతర్రాష్ట్ర వాహన దొంగల ముఠా అరెస్ట్

- భారీగా ఆయుధాలు, నగదు, టిప్పర్ స్వాధీనం
- తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో 11 కేసులు
- నేరగాళ్లను పట్టుకున్న సంగారెడ్డి జిల్లా పోలీసులు

**సంగారెడ్డి, (సిరి న్యూస్)**



అంతర్రాష్ట్ర స్థాయిలో వాహన దొంగతనాలకు పాల్పడుతున్న భారీ ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వివరాలు వెల్లడిస్తూ.. గత నెల 9న నారాయణఖేడ్ మనూర్ ఎక్స్ రోడ్ వద్ద దొంగతనానికి గురైన డీసీఎం వాహనం కేసును దర్యాప్తు చేస్తుండగా ఈ ముఠా గుట్టురట్టయిందని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ మరియు నారాయణఖేడ్ పోలీసులు ప్రత్యేక బృందా లుగా ఏర్పడి, సీసీటీవీ ఫుటేజీలు మరియు సాంకేతిక ఆధారాలతో నిందితులను గాలించారు. ఈ క్రమంలో మే 3వ తేదీ రాత్రి నారాయణఖేడ్ పంచగామ కమాన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మహమ్మద్ ఖుర్షీద్ అహ్మద్, మహమ్మద్ జాఫర్ అలీ అనే ఇద్దరు నిందితులు అనుమానాస్పదంగా దొరికారు. వారిని విచారించగా మరో 11 మందితో కలిసి గ్యాంగ్‌గా ఏర్పడి తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. ఈ ముఠా ఒక రాష్ట్రంలో వాహ నాలను దొంగిలించి మరో రాష్ట్రంలో విక్రయిస్తూ పోలీసులను తప్పుదోవ పట్టిస్తోందని ఎస్పీ వివరిం చారు. నిందితుల వద్ద నుండి ఒక పిస్టల్ (2 రౌండ్లు), ఒక ఎయిర్ గన్, రెండు కత్తులు, 2 లక్షల రూపాయల నగదు, ఒక టిప్పర్ వాహనం మరియు 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, పరారీలో ఉన్న మరో ఏడుగురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రెస్ మీట్‌లో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సీఐలు శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కొంపల్లిలో నెలకొన్న సమస్యలపై కమిషనర్ కి ఫిర్యాదు చేసిన జమ్మి దేవేందర్

**కొంపల్లి.మే.04(సిరి న్యూస్).**



సమస్యలతో ఇంకా కొంపల్లి కొట్టుమిట్టాడుతోందని కొంపల్లి మాజీ సర్పంచ్,మేడ్చల్–మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిజెమ్మి దేవేందర్ అన్నారు.సోమవారం నాడు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ని కలిసిన అయన పలు సమస్యలను కమిషనర్ కి వివరించారు.ఫైర్మోన్ట్ అపార్ట్మెంట్,డిలైట్ కిచెన్,క్లౌడ్–9 హాస్పిటల్ వంటి ప్రైవేట్ స్థాపనల నుండి 2 ఫీట్ల డ్రైనేజ్ పైప్‌లైన్‌ను సెంట్రల్ పార్క్ కాలనీ మరియు శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన 1 ఫీట్ డ్రైనేజ్ లైన్‌లో అనధికారికంగా కలుపుతున్న విషయాన్ని ఆయన కమిషనర్ కి వివరించారు.ఈ అక్రమ చర్యవల్ల రానున్న వర్షాకాలంలో వర్షపు నీటికి శ్రీనివాస్ నగర్ కాలనీ పూర్తిగా నీటమునగడం జరుగుతున్నదని ఈ వర్షపు నీటి సమస్యతో ప్రజలు తీవ్రమైన డ్రైనేజ్ సమస్యలు, నీటి మునిగిపోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని తెలియజేశారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ అనుమతులు లేనిఅక్రమ డ్రైనేజ్ కనెక్షన్‌ను వెంటనే తొలగించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ని కోరారు.స్పందించిన కమిషనర్ వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపినట్టుగా వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కొంపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్ ముదిరాజ్.సెంట్రల్ పార్క్ కాలనీ సభ్యులు, శ్రీనివాస్ నగర్ కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో రైతు వారోత్సవాలు





**వెల్దుర్తి, మే 04,( సిరి న్యూస్):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు వ్యవసాయ శాఖకు సంబంధించిన రోజుగా పరిగణిస్తూ సోమవారం రైతు వేదిక స్థాయిలో వెల్దుర్తి మండలం లో బండపోసంపల్లి, మంగల్పర్తి ,హస్తాలపురం, కుక్కునూరు, వెల్దుర్తి రైతు వేదికలలో రైతులకు నేలల ఆరోగ్యము, భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి రైతులకు అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది. వ్యవసాయ అధికారి ఝాన్సీ మాట్లాడుతూ రైతులకి భూసార పరీక్షలు ఎలా చేసుకోవాలి అలాగే నేలల ఆరోగ్యం వాటి ప్రాముఖ్యత భూసార పరీక్షల్లో తెలిపిన వివరాల ఆధారంగా తగిన మోతాదులో ఎరువుల యాజమాన్యం, సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడి పద్ధతులను ఎలా పాటించాలో తెలియజేస్తూ సేంద్రియ పద్ధతిలో జీవన ఎరువులను ఉపయోగించి విత్తన శుద్ధి ప్రక్రియను పద్ధతినీ ప్రత్యక్ష ప్రదర్శన చేసి చూపించడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను పంపిణీ చేయడం, రైతుల అనుభవాలను తోటి రైతులతో పంచుకునేలాగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.రైతులకు ప్రభుత్వం గుర్తించిన ఎనిమిది రకాల సన్న వరి రకాలను సాగు చేయవలసిందిగా సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరెగూడెం సర్పంచ్ చైతన్య హనుమంత రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ దుర్గ్యా , ఎల్కపల్లి సర్పంచ్ పావనిశివలింగం మంగల్పర్తి సర్పంచ్ సంధ్య రామకృష్ణ, రామయపల్లి సర్పంచ్ పావని మహేందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు మజీద్ అలీ, ఉత్తమ్ కుమార్, సాయికుమార్, చంద్రవేణి, సింధు, మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఉదయ్, ఎఫ్ బి ఓ డైరెక్టర్లు మెంబర్లు మండల రైతులు పాల్గొనడం జరిగినది.

# శాస్త్రీయ సాగుతోనే రైతుకు లాభం

- భూసార పరీక్షలతోనే సాగులో లాభాలు
- శాస్త్రీయ పద్ధతులే అధిక దిగుబడులకు మార్గం
- రైతులకు పలువురు సూచన
- రైతు వేదికల్లో ఘనంగా రైతు వారోత్సవాలు

**గుమ్మడిదల, మే 4 (సిరి న్యూస్)**



రైతులు భూసార పరీక్షల నివేదికలను ఆధారంగా తీసుకుని ఎరువులను వినియోగిస్తే సాగు వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం గుమ్మడిదల రైతు వేదికలో నిర్వహించిన రైతు వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల నేల నాణ్యత దెబ్బతింటుందని హెచ్చరించారు. భూమి స్వభావాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకుని సాగు చేపడితేనే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరావు మాట్లాడుతూ భూమిలో పోషకాల లభ్యతను బట్టి సమతుల్య ఎరువుల వినియోగం చేయడం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన మేరకే ఎరువులు వాడటం ద్వారా నేల ఆరోగ్యం కాపాడబడుతుందని, దీర్ఘకాలికంగా వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సంధ్య రెడ్డి, వార్డు కౌన్సిలర్లు పొన్నాల ప్రమీల, ఆకుల మాధవి, గిద్దె విజయలక్ష్మి, మేడిపల్లి మురళి, కో–ఆప్షన్ సభ్యులు భాస్కర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రవీందర్, ఏఈఓ నిఖితతో పాటు రైతులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఉతీర్ణులైన విద్యార్థులకు సన్మానం



**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** వేంసూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభ కనబరిచిన పదవ తరగతి విద్యార్థులను గ్రామ సర్పంచ్ ఫకృద్దీన్ ఘనంగా సన్మానించారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కోసం వేంసూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 500కు పైగా మార్కులు సాధించిన పది మంది విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారని, వారు ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా సన్మానించారు. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం కీలకమని, క్రమశిక్షణతో చదివి ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, క్రమశిక్షణ విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. విద్యార్థులు తమకు నచ్చిన కోర్సుల్లో చేరి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ జీనత్ బేగం మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు బికె.నరసింహారావు, రవికుమార్, ఉమామహేశ్వర రెడ్డి, గ్రామ కార్యదర్శి కిషోర్ బాబు, కమిటీ చైర్మన్ జీనత్ బేగం, వార్డు సభ్యులు యాకుబ్ నబీ, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జలగం వెంగళరావు జయంతి



**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 105వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సత్తుపల్లి పట్టణంలోని జలగం పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగామయి దయానంద్ దయానంద్ ఆయన చేసిన సేవలు అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. అనంతరం సత్తుపల్లి మండలం బేతపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రైతు వారోత్సవాల్లో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బేతుపల్లి గ్రామంలో సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివవేణును కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ సుమలత, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నారావు, బేతుపల్లి గ్రామ సర్పంచ్ అమ్ములు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో పెళ్లిరోజు వేడుకలు

**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూర్లో యువ దంపతులు తమ పెళ్లిరోజును వృద్ధాశ్రమంలో ఘనంగా జరుపుకున్నారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన నడ్డి మురళి–సునీత దంపతులు సోమవారం వేంసూర్లోని వృద్ధాశ్రమంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి వారికి భోజనం, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో కలిసి ఆనందంగా గడిపిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం దంపతులు మాట్లాడుతూ తమ పెళ్లిరోజును వృద్ధుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వృద్ధులకు పుష్టికరమైన ఆహారం అందించడం ద్వారా వారికి సంతోషం కలిగించడం తమకు సంతృప్తినిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం తమ పెళ్లిరోజు సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించి, తమ ఆనందాన్ని సమాజంతో పంచుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చర్చి సిస్టర్స్ జులిత, తేజ, కుమారి, పాపమ్మ, సుజాత, వెంకటేశ్వరి, రోహన్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, అక్షయ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా జలగం జయంతి వేడుకలు



**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సర్దార్ జలగం వెంగళరావు 103వ జయంతిని జలగం యువసేన ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో స్వర్గీయ సర్దార్ జలగం వెంగళరావు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడుతూ జలగం వెంగళరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన వేసిన పునాది శాశ్వతంగా నిలిచిపోతుందని తెలిపారు. ఖమ్మం జిల్లాకు సింగరేణి, నవభారత్, స్పాంజ్ ఐరన్, ఐటీసీ, హెవీ వాటర్ ప్లాంట్ వంటి కీలక పరిశ్రమలను తీసుకురావడం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకే చెందుతుందని పేర్కొన్నారు. అలాగే కిన్నెరసాని వంటి ప్రాజెక్టుల ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి దోహదం చేశారని గుర్తుచేశారు. జలగం వెంగళరావు సేవలు, ఆయన జీవితం భవిష్యత్ తరాలకు మార్గదర్శకమవుతుందని తెలిపారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక వారోత్సవాలు




**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** నియోజకవర్గంలోని వేంసూరు మండల పరిధిలో ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం వేంసూరు, వెన్నచెడు వెంకటాపురం, కందుకూరు, అమ్మపాలెం, శంభునిగూడెం గ్రామాలలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా వేంసూర్ మండలంలోని ఐదు రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమం ప్రారంభంలో ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించి, అనంతరం రైతులతో భూసార పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం ద్వారా ఖర్చు తగ్గించడం, భూమి ఆరోగ్యం మెరుగుపర్చడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మట్టి, నీటి నమూనాలను సేకరించి పరీక్ష కేంద్రాలకు పంపే విధానాన్ని వివరించారు. రాబోయే వానకాలంలో మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను సాగు చేయాలని సూచించారు. ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాలు ఉన్నందున పంటల ప్రణాళిక ముందుగానే సిద్ధం చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం సర్పంచులు రైతులకు భూసార పరీక్షల ఫలితాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఏఈఓలు, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిబద్ధతకు నిదర్శనం ఫ్లోరినా సేవలు

## కొనియాడిన న్యాయవాదులు

**ఆసిఫాబాద్ టౌన్(సిరి న్యూస్ ):** ఆసిఫాబాద్ జిల్లా బార్ అసోసియేషన్ సీనియర్ సూపరింటెండెంట్ ఫ్లోరినా పదోన్నతి పొంది, ఆదిలాబాద్ కోర్టులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏ ఓ)గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆమె నిబద్ధతను, న్యాయవాదులకు అందించిన సహకారాన్ని ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. సతీష్ బాబు, సీనియర్ న్యాయవాదులు టి. సురేష్, ఎం. సురేష్, మహిళా న్యాయవాదులు శ్రీహిత, పూజిత , చరణ్ తేజ, నరహరి, రాజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు సాగు చేసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం రైతులందరి నుంచి జొన్న పంట కొనుగోలు చేస్తామని, పూర్తి షెడ్యూల్ను త్వరలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు కనీస సౌకర్యాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు, మున్సిపల్ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

## జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**గంభీరావుపేట(సిరి న్యూస్ ):** గంభీరావుపేట మండలంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రుల బృందం పర్యటన సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పర్యటన నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్తో పాటు పరిసర ప్రాంతాలను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పర్యటన సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాకపోకల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, హెలిప్యాడ్ భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవి, ఆర్ఐలు మధుకర్, రమేష్, ఎస్సై అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఆటోడ్రైవర్



**తాండూర్(సిరి న్యూస్ ):** తాండూర్ మండలానికి చెందిన ఆటోడ్రైవర్ అభిరామ్ మానవత్వాన్ని చాటుకుంటూ ఓ గర్భిణీకి ప్రాణదాతగా నిలిచాడు. మండలంలోని ఎంవికె త్రీ గ్రామానికి చెందిన అభిరామ్, ఎన్వీకే త్రీ మన్నెగూడకు చెందిన గర్భిణీ పురిటి నొప్పులతో బాధపడుతుండగా తన ఆటోలో ఆసుపత్రికి తరలించాడు. ఆసుపత్రిలో వైద్యులు ఆ మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమని చెప్పడంతో, ఎక్కడికీ వెళ్ళాల్సిన అవసరం లేదని, తానే రక్తదానం చేస్తానని ముందుకు వచ్చి అభిరామ్ మానవత్వాన్ని ప్రదర్శించాడు. అతని రక్తదానంతో తల్లి, శిశువు క్షేమంగా ఉండటం కుటుంబ సభ్యులకు ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా బీఆర్టీ అధ్యక్షులు హబీబ్ పాషా మాట్లాడుతూ ఈ కాలంలో సొంత బంధువులే పరామర్శించని పరిస్థితుల్లో అభిరామ్ చూపిన సేవ మహోన్నతమని కొనియాడారు. తన ఆటోలో ప్రయాణించిన గర్భిణీకి రక్తదానం చేసి ఆమె ప్రాణాలను కాపాడటమే కాకుండా పుట్టబోయే శిశువుకు కొత్త జీవితం ఇచ్చిన గొప్ప వ్యక్తి అభిరామ్ అని ప్రశంసించారు. తాండూర్ మండల ఆటో యూనియన్ తరపున అభిరామ్కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ప్రశంసాపత్రం అందజేశారు.

# వైభవంగా ఆంజనేయ స్వామి వార్షికోత్సవం



**సత్తుపల్లి(సిరి న్యూస్ ):** వేంసూరు మండలంలోని లచ్చన్నగూడెం గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి వారి 13వ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం కళ్యాణ మహోత్సవం, చాముండి హోమం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తుల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని అన్నదానంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. మేళతాళాలు, కోలాటాలు, భక్తిగీతాలతో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. భక్తుల ఆనందోత్సాహాల మధ్య ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించారు.

# దోపిడీ దొంగల హల్చల్

**ఘురాసంఘం, మే 4(సిరిన్యూస్)**

ఘురాసంఘం మండలం లో గుర్తు తెలియని వ్యక్తుల దారిదోపిడి తో ప్రజలు భయ భ్రాంతులకు గురి అవుతున్నారు.రాత్రి వేళలో ఒంటరిగా ప్రయాణం చేస్తున్న వాహన దారులను లక్ష్యంగా చేసుకొని కత్తులను చూపిస్తూ వారి దగ్గర ఉండే నగదును, విలువైన ఆభరాణాలను, సెల్ ఫోన్ లను దొచుకుని పారిపోతున్నారు. ముఖానికి మాస్క్ ను,నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను ఉపయోగిస్తూ పోలీస్ ల కళ్ళు గప్పి తిరుగుతున్నారు.ఆదివారం రోజున CH నర్సిములు(30)ఆర్ టీ సి డ్రైవర్ విధులు పూర్తిచేసుకుని ఇంటికి తిరిగి వచ్చే సమయంలో అడ్డగించి ఒక వెయి రూపాయల నగదు ను, సెల్ ఫోన్ లాక్కుని కత్తి పట్టుకుని వెంబడించారు, సదరు వ్యక్తి వారికీ దొరకకుండా పారిపోవడంతో ప్రాణాలను కాపాడుకున్నట్లు వెల్లడించారు. తన సెల్ ను అనుచిత పనులకు వాడకుండా ఉండేందుకు పోలీస్ వారికీ ఫిర్యాదు చేసానని తెలిపారు.

# వెలిమెలలో రైతు వారోత్సవాలు ప్రారంభం

**సహజ వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణ అవగాహన**



**రామచంద్రపురం, మే 4, (సిరి న్యూస్):**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో సోమవారం వెలిమెల రైతు వేదికలో రైతు వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మల్లేపల్లి బుచ్చి రెడ్డి ఆధ్వర్యం వహించారు.రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం పద్ధతులపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేందుకు ఆధునిక వ్యవసాయ విధానాలను అనుసరించాలని సూచించారు.పచ్చిరొట్టె, జనుము, జీలుగు వంటి పంటలను సాగు చేయడం ద్వారా నేల నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, మట్టి నమూనాలు పరీక్ష చేయించుకోవాలని రైతులకు సూచించారు.పిఎసిఎస్ ద్వారా రైతులకు రుణ సదుపాయాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ సంతోష్ పవర్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాణి, రోజా, సొసైటీ డైరెక్టర్ మోహన్ రెడ్డి, సీఈఓ బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో రైతులు హాజరయ్యారు

# రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్

**హైదరాబాద్ సిరి న్యూస్ ఏప్రిల్ 4 :**




ఇంటి నిర్మాణానికి సంబందించిన ఫైల్ క్లియర్ చేసేందుకు లంచం అడిగిన ఓ అవినీతి అధికారిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.బాధితుని కథనం ప్రకారం బోరబండ జిఎచ్ఎంసి ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీలత ఇంటి నిర్మాణ అనుమతి ఫైల్ క్లియర్ చేసేందుకు బాధితుడి నుండి రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసింది. అందులో భాగంగా సోమవారం రూ.లక్ష తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమెను అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు

# భక్తి మార్గం ద్వారా మనుషుల్లో సత్సంకల్పాలు పెంపొందుతాయి

**శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి**



**గుమ్మడిదల, మే 4 (సిరి న్యూస్ ):**

దేవాలయ నిర్మాణం భక్తి భావాన్ని పెంపొందించి సమాజాన్ని ఒక తాటిపైకి తీసుకువస్తుందని గురు మదనానంద సరస్వతి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న పోచమ్మ తల్లి దేవాలయానికి శంకుస్థాపన కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు మాట్లాడుతూ దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా సమాజ ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. భక్తి మార్గం ద్వారా మనుషుల్లో సత్సంకల్పాలు పెంపొందుతాయని, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గ్రామ పురోహితులు శంకర్ శర్మ, నాయకులు నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ,అటవీ భూముల సరిహద్దు సమస్యలను పరిష్కరించాలి






- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్,04(సిరిన్యూస్)**

రెవెన్యూ,అటవీ భూముల సరిహద్దు సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ నగేష్,అటవీ,సివిల్ సప్లై,హౌసింగ్, రెవెన్యూ,మిషన్ భగీరథ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రెవెన్యూ,అటవీ భూముల సరిహద్దు సమస్యలను పరిష్కరించాలని, ధాన్యాం కోనుగోలులో లోడింగ్ అన్ లోడింగ్ పక్రియ త్వరగా పూర్తి చేయాలని, వేసవిలో త్రాగు నీటి సమస్య రాకుండా చూడాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని తెలుసుకున్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేపట్టాలని ఆదేశించారు. సాదా బైనామాలు పరిశీలించాలని, జనగణన ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యం , స్వీయ గణనలో అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. సంక్షేమ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు.రెడ్ క్రాస్ సొసైటీ సేవలు విస్తరించాలని సభ్యత్వం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి జోజీ, ఆర్డీవోలు తాసిల్దార్లు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి





- **జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్,04(సిరిన్యూస్)**

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజావాణి హాల్లో ప్రజలనుంచి వినతులను స్వీకరించారు.ఆర్డీవో స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా జిల్లాలోని మూడు డివిజన్ల వారిగా ఆర్డీఓ మెదక్ లో -9 ఆర్డీఓ తూప్రాన్ 2 ఆర్డీఓ నర్సాపూర్ లో 2 దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్లో 45 దరఖాస్తులు రాగ పెన్షన్లు,15, ధరణి 15, ఇతర 15 దరఖాస్తుల వచ్చాయన్నారు.తక్షణమే దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# యూరియా వాడకం తగ్గించాలి..

- **వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శాంతి..**

**హత్నూర, మే 04, (సిరి న్యూస్)**

హత్నూర మండల పరిధిలోని చింతల చెరు రైతు వేదికలో ఆయా గ్రామాల రైతులతో సోమవారం వ్యవసాయ శాస్త్ర వేత్తలు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి పొలంలో పంట మార్పిడి చేయాలని , యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటదని తెలిపారు. అదే విధంగా ప్రతి సంవత్సరం మట్టినమున సేకరించి పరీక్షలు చేయించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ గీత , గుండ్లమాచునూర్ సర్పంచ్ బేగరి శ్రీహరీ, ఉప సర్పంచ్ గునుకుంట్ల శంకర్ , చింతల్ చెరు సర్పంచ్ మమత శివ , ఉపసర్పంచ్ అంబటి భాస్కర్ , కొత్తగూడెం సర్పంచ్ మమత రమేష్ , నాగారం సర్పంచ్ వరాల వీరేశం , షర్కాన్ పల్లి సర్పంచ్ మన్నే లక్ష్మి శ్రీను పి ఏ సి ఎస్ డైరెక్టర్ అంబటి యాదయ్య ఏ.ఈ.ఓ.మనిషా ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# రైతులకు ఇబ్బందులు లేకుండా యాసంగి ధాన్యం కొనుగోలు చేయాలి


- **రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి**

**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లు సమర్థ వంతంగా నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిలా శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని, రైతులు తమ ధాన్యం కుప్పలను ఎత్తైన ప్రదేశాల్లో నిల్వ చేయాలని పేర్కొన్నారు. గాలులతో టార్పాలిన్ కవర్లు ఎగిరిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు సమయానుకూలంగా తెలియజేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షామియానాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అలాగే మాయిశ్చర్ యంత్రాలు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హమాలీలు, వాహనాల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. మే నెలాఖరుకల్లా 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టరేట్లోని వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్ఎస్.చిత్రు, పౌర సరఫరాల శాఖ అధికారులు నందిని, సుధారాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బీజేపీ విజయంపై గంభీరావుపేటలో సంబరాలు

**గంభీరావుపేట(సిరి న్యూస్ ):** మూడు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయంపై మండలంలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇది సాధారణ గెలుపు కాదని, ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న ప్రధాన మంత్రి నరేందర్ మోదీ నాయకత్వానికి ఇది ఘన గుర్తింపని అన్నారు. అభివృద్ధి, దేశభక్తిపై ప్రజల నమ్మకమే ఈ విజయానికి కారణమని తెలిపారు. ప్రతి కార్యకర్త కృషికి ఇది ఫలితమని, ప్రతి ఓటు వెనుక ఉన్న విశ్వాసానికి ఇది గౌరవమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను మోసం చేస్తోందని, ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతు వ్యతిరేక విధానాలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, సర్పంచులు పొన్నాల మహేష్, బండ సుకన్య దేవయ్య, సీనియర్ నాయకులు రాజు గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, సర్వోత్తమ్, శ్రీనివాస్, రవీందర్, కృష్ణకాంత్ యాదవ్, దేవేందర్ యాదవ్, చంద్రం యాదవ్, రమేష్, పుల్యా నాయక్, దేవా గౌడ్, మహేష్ యాదవ్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



# కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పులేదు

మిల్క్ బ్యూటీ తమన్నా తన పర్సనల్ లైఫ్, ప్రేమ వ్యవహారాలపై చేసిన కామెంట్స్ ప్రజెంట్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ఒకసారి ప్రేమలో విఫలం అయినా అటు వైపు మళ్లీ వెళ్లాలి అనుకోవడం లేదు అని అంటుంటారు. కానీ తమన్నా ఆలోచనలు దానికి భిన్నంగా ఉన్నాయి. విజయ్ వర్మతో ప్రేమ, బ్రేకప్ అనంతరం మళ్లీ కెరీర్‌పై ఫోకస్ పెట్టి వరుస సినిమాలు చేస్తుంది. ఇందులో భాగంగానే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని.. ప్రేమ ఒక్కరితోనే ఆగిపోవాల్సిన అవసరం లేదంటూ షాకింగ్ కామెంట్స్ చేసింది. 'జీవితంలో ఎన్నిసార్లు అయినా ప్రేమలో పడే అవకాశం ఉంటుంది. అది కేవలం ఒక్క వ్యక్తికే పరిమితం కావాల్సిన అవసరం లేదు. మనసుకు నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పు లేదు. ఎందుకంటే బంధాలు అనేవి మనల్ని ఒకచోట కట్టిపడేసేవిగా లేదా మన స్వేచ్ఛను హరించేవిగా ఉండకూడదు. భాగస్వామితో ఉండే బంధం మన ఎదుగుదలకు తోడ్పడేలా, ఒకరినొకరు ప్రోత్సహించుకునేలా ఉండాలి. అలాంటి ఆరోగ్యకరమైన బంధం దొరికే అన్వేషణ కొనసాగిస్తూనే ఉంటా' అంటూ తమన్నా చెప్పడం విశేషం.



# ఓనమ్‌కి మమిత సందడి

'కర' సినిమాతో ఇటీవలే తెరపై సందడి చేసింది మలయాళ భామ మమితా బైజు. తనదైన నటనతో యువతను విశేషంగా ఆకట్టుకుంటోన్న ఈ తార.. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఆమె, హీరో నివిన్ పౌలీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బెత్లెహం కుటుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీష్ ఏడీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది మమిత. ''విజయవంతంగా చిత్రీకరణ ముగిసింది. నటీనటులకు, సాంకేతిక బృందానికి, తెరవెనుక ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ ఏడాది ఓనమ్ పండగ సందర్భంగా ఈ ప్రేమకథ థియేటర్లలోకి రాబోతుంద''ని ఆ పోస్ట్‌లో పేర్కొంది. రొమాంటిక్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో సంగీత్ ప్రతాప్, సురేశ్ కృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భావనా స్టూడియోస్ నిర్మిస్తుంది.



# 'జై హనుమాన్'లో అక్షయ్ ఖన్నా?

ధురంధర్ సినిమాతో జనాల్లోకి చొచ్చుకుపోయిన అక్షయ్ ఖన్నాకు సౌత్ ఇండియాలో విపరీతమైన అవకాశాలు వస్తున్నాయి. ఇప్పటికే అతనికి తెలుగులో చాలా సినిమాలలో అవకాశాలు రాగా.. లేటెస్ట్ గా మరో బంపర్ ఆఫర్ తగిలినట్లు టాక్ నడుస్తోంది. ప్రశాంత్ వర్మ రూపొందిస్తున్న జై హనుమాన్ సినిమాలో అక్షయ్ ఖన్నా నటించనున్నట్లు సమాచారం. ఈ మేరకు చిత్ర బృందంతో సంప్రదింపులు కూడా పూర్తయ్యాయట.
త్వరలో అతడి పాత్ర ఏది అనేది ? మేకర్స్ ప్రకటించనున్నారని టాలీవుడ్ సర్కిల్స్ లో ఓ వార్త వైరల్ అవుతోంది. ఇప్పటికే ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్రను అక్షయ్ ఖన్నా పోషిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇక ఇప్పుడు జై హనుమాన్ సినిమాలో కూడా ఓ స్పెషల్ రోల్ ఇవ్వనున్నారట. ఇది ఇలా ఉండగా జై హనుమాన్ సినిమాలో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్, జనాలను ఆకట్టుకుంటున్నాయి. సినిమాపై అంచనాలను కూడా పెంచాయి.





# మద్యంపై జాన్వీ వ్యాఖ్యలు.. తప్పుగా అర్థం చేసుకున్నారంటూ టీమ్ పోస్ట్

నటి జాన్వీ కపూర్ తన తాజా ఇంటర్వ్యూలో మద్యం అలవాటు గురించి చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆమె ఖండించారు. మద్యానికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా చిత్రీకరించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.
ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో ఎదురైన ఒక బాధాకరమైన సంఘటన తర్వాత మద్యం అలవాటు అయిందని దానినుంచి బయటకు రావడానికి చాలా కష్టపడ్డానని పేర్కొన్నారు. అయితే, దీనిపై వస్తున్న కథనాలు తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆమె టీమ్ పేర్కొంది. మద్యం వ్యసనంపై అవగాహన కల్పించే 'ఆఫ్ ది రాక్స్' 'అమహా' సంస్థలు నిర్వహించిన పాడకాస్ట్‌లో జాన్వీ మాట్లాడారు. ఆ మాటలను తప్పుగా వక్రీకరించారని సదరు సంస్థలు నోట్ విడుదల చేశాయి.
''జాన్వీకపూర్, ఈ కార్యక్రమానికి సంబంధించిన కంటెంట్‌ను కొన్ని మీడియా సంస్థలు తప్పుగా ప్రచారం చేయడం మా దృష్టికి వచ్చింది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. జాన్వీకపూర్ ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగమయ్యారు. ఆమె పంచుకున్న వ్యక్తిగత అనుభవాల వెనక ఉన్న అసలు ఉద్దేశాన్ని, సందర్భాన్ని పక్కదోవ పట్టించేలా ప్రచారం చేయడం సరికాదు'' అని పేర్కొన్నాయి. ఈ నోట్‌ను జాన్వీకపూర్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. వాస్తవాలను తెలుసుకోకుండా వార్తలను వైరల్ చేయవద్దని కోరారు.



# ఆ నరకం చూడలేక చంపేయమన్నాను..

ఈమె ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖ వాణి కుమార్తెగా అందరికీ సుపరిచితురాలు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో తక్కువ కాలంలోనే మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది.సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కెరీర్ ప్రారంభించిన ఈమె, ఇప్పుడు సినిమాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సుప్రిత.. తాను ఎదుర్కొన్న తీవ్ర అనారోగ్య సమస్యల గురించి ఆవేదన వ్యక్తం చేసింది.
సుప్రిత మాట్లాడుతూ.. 'సోషల్ మీడియాలో వచ్చిన బాడీ షేమింగ్ కామెంట్స్ వల్ల మానసిక ఒత్తిడికి లోనై, బరువు తగ్గాలనే ఆరాటంలో నా ఆహారపు అలవాట్లను పూర్తిగా మార్చుకున్న. రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తిన్న ఒక్క పూట కూడా బిర్యానీ వంటి హెవీ ఫుడ్ తీసుకోవడంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నదని వెల్లడించింది. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురై 15 రోజుల పాటు ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. రోజుకు 15 సార్లు వాంతులు అవుతూ నీళ్లు తాగినా పడక నరకం అనుభవించా. ఒక దశలో ఆ బాధ భరించలేక నను చంపేయమని కోరుకున్నా' అని ఆమె షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది.
ప్రస్తుతం కోలుకున్న సుప్రిత తన సినీ కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా, మంచి స్క్రిప్ట్ దొరికితే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపింది. ముఖ్యంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ వంటి పెద్ద హీరోల చిత్రాలలో చెల్లెలి పాత్రలు వచ్చినా వదులుకోనని స్పష్టం చేసింది. అయితే, తనకు ఇష్టమైన విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేనిల సరసన మాత్రం సిస్టర్ పాత్రలు చేయడం కష్టమని ఆమె సరదాగా వ్యాఖ్యానించింది.



## వాయిదా కన్ఫర్మ్! విచారం వ్యక్తం చేస్తున్నా

# సమంత ఫ్యాన్స్

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మా ఇంటి బంగారం'. తన సొంత బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక మూవీకి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుంది. ఓ బేబి హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ చిత్రంపై ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో పాజిటివ్ అభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 15న విడుదల చేస్తామని చిత్ర బృందం గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే.. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా విడుదల తేదీ మారినట్లు ఫిలిమ్ సర్కిల్‌గా గుసగుసలు వినిపిస్తున్నాయి. మే 15న వేరే చిత్రం రిలీజ్‌కు ఉండగా.. ఈ చిత్రాన్ని పోస్ట్ పోన్ చేశారట. అంతే కాకుండా.. రిలీజ్ సమయం దగ్గరలోనే ఉండగా.. ఎలాంటి ప్రమోషన్స్, హడావిడి లేకపోవడంతో ఈ మూవీ మాక్సిమమ్ వాయిదా పడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. మిరి కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడు అనేది త్వరలోనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో సమంత ఫ్యాన్స్ నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.



# 'పుష్ప' నటుడు ప్రధాన పాత్రలో సినిమా.. టైటిల్ పోస్టర్‌తో సినిమాపై మరింత హైప్

'పుష్ప' సినిమాతో టాలీవుడ్‌లో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న నటుడు కేశవ్ ప్రధాన పాత్రలో ఓ మూవీలో నటిస్తున్న విషయం తెలిసిందే. హర్ష డైస్ డైస్ ఈ చిత్రానికి రచన అండ్ దర్శకత్వం వహిస్తున్నాడు. డైస్ ఆర్ట్ ఫిల్మ్స్ సమర్పిస్తుండగా.. హరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 2023లోనే ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్‌తో పాటు పోస్టర్ రిలీజ్ చెయ్యగా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు మరో అప్డేట్ రాలేదు. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా టైటిల్ ఫిక్స్ చేశారు మేకర్స్. పుష్ప తర్వాత ఫుల్ రోల్‌లో నటుడు కేశవ్ నటిస్తున్న ఈ వైవిధ్యమైన చిత్రానికి 'మటన' అనే క్యాచీవ్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ మేరకు పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'రక్తం.. శక్తి.. ప్రతీకారం.. 'మటన్' అనే ఒక తుఫాను రాబోతోంది.. వేట మొదలైంది... ఈసారి, అది అత్యంత క్రూరమైనదిగా ఉండబోతుంది' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ వైలెంట్‌గా కనిపిస్తూ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచేస్తుంది. కాగా.. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల వివరాలు, టెక్నికల్ అప్డేట్స్ త్వరలో రానున్నాయి.



# యాక్టర్ అయితే ఇంటి నుంచి వెళ్లిపొమ్మన్నారు

ప్రముఖ నటుడు రాజశేఖర్ డాక్టర్ అనే సంగతి తెలిసిందే. వైద్యుడైన ఆయన కుటుంబాన్ని కాదనుకుని మరీ సినిమాల్లోకి వచ్చారు. తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. డాక్టర్ అయితే ఇంట్లో ఉండు.. యాక్టర్ అయితే ఇంటి నుంచి వెళ్లిపో అని తన తండ్రి హెచ్చరించగా.. తాను ఇంటి నుంచి బయటకు వచ్చేశానని తెలిపారు. కెరీర్ ప్రారంభ అనుభవాలను, తన ప్రేమ పెళ్లి సంగతులనూ పంచుకున్నారు.
'మీ ఇద్దరిలో (జీవిత, రాజశేఖర్) ఎవరు ముందుగా ప్రపోజ్ చేశారు?' అనే ప్రశ్నకు.. ఆవిడ ప్రపోజ్ చేసేలా నేను చేశా అని నవ్వులు పూయించారు. నటి శ్రీదేవితో పెళ్లి ప్రపోజల్ వచ్చిందన్న విషయాన్నీ గుర్తుచేసుకున్నారు. తాను గోటీల ఫ్యాక్టరీ రన్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలపైనా మరోసారి ఫన్నీగా రియాక్ట్ అయ్యారు. 'జెంటిల్‌మేన్', 'చంటి' సినిమాల్లో నటించే అవకాశం మిస్ అయ్యానన్నారు.
యంగ్ హీరోల సినిమాల్లో రాజశేఖర్ కీలక పాత్రలు పోషిస్తున్న సంగతి తెలిసిందే. మోటోక్రాస్ రేసింగ్ మూవీ 'బైకర్'లో బుల్లెట్ సునీల్ నారాయణ్‌గా అలరించారు. శర్వానంద్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా థియేటర్లలో సందడి చేసి.. ప్రస్తుతం ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.